తమిళనాడులోని కోయంబత్తూరులో ప్రధాని మోదీ నిర్వహించిన రోడ్ షోకు తీసుకొచ్చిన స్కూల్ పిల్లలు

మోదీ రోడ్‌షోకి స్కూల్ పిల్లలు

చెన్నై: తమిళనాడులో ప్రధాని నరేంద్ర మోదీ రోడ్ షోకి స్కూల్ పిల్లలను సమీకరించడం వివాదాస్పదంగా మారింది. సోమవారం కోయంబత్తూరులో ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయిబాబా విద్యాలయం అనే ఎయిడెడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులను తీసుకువచ్చారు. వీరంతా స్కూల్ యూనిఫామ్‌లోనే రోడ్‌షోలో పాల్గొన్నారు. పిల్లలతో ఎన్నికల ప్రచారం చేయించవద్దని ఎన్నికల నియామవళి చెప్తున్నందున అధికారులు స్పందించారు. కోయంబత్తూరు జిల్లా ఎలిమెంటరీ విద్యాధికారి పునిత ఆంటోనీయమ్మల్ మంగళవారం విచారణ జరిపి.. స్కూల్ పిల్లలను రోడ్‌షోకు తీసుకువెళ్లిన హెడ్‌మాస్టర్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఘటనపై నివేదిక ఇవ్వాలని స్కూల్ యాజమాన్యాన్ని ఆదేశించారు.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించాలి

- తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్
- నియమించిన 24 గంటల్లోనే బెంగాల్ డీజీపీపై ఈసీ వేటు
- కొత్త డీజీపీగా సంజయ్‌ముఖర్జీ

న్యూఢిల్లీ, మార్చి 19: ఎన్నికల సంఘం వంటి సంస్థలను కూడా నిర్వీర్యం చేసేందుకు బీజేపీ కుయుక్తులు పన్నుతున్నదని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఆ పార్టీ నేత డెరెక్ ఓబ్రియాన్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విపక్షాలను టార్గెట్ చేసుకొనేందుకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా తన పార్టీ ఆఫీస్‌గా మార్చుకొనేంతగా.. ప్రజలను ఎదుర్కొనేందుకు బీజేపీ భయపడుతున్నదా? అని ప్రశ్నించారు.

24 గంటల్లోనే డీజీపీగా వివేక్ సహాయ్ తొలగింపు

పశ్చిమబెంగాల్‌లో డీజీపీ ఎపిపోడ్ మలుపులు తిరుగుతున్నది. డీజీపీగా ఉన్న రాజీవ్ కుమార్‌పై ఈసీ సోమవారం వేటు వేయగా.. రాష్ట్ర ప్రభుత్వం గంటల వ్యవధిలో కొత్త పోలీస్ బాస్‌గా వివేక్ సహాయ్‌ను నియమించింది. 24 గంటల్లోపే వివేక్ సహాయ్ ఆ పోస్టు నుంచి తొలగించిన కేంద్ర ఎన్నికల సంఘం.. కొత్త పోలీస్ బాస్‌గా ఆయన స్థానంలో సంజయ్ ముఖర్జీని నియమించింది.

డీజీపీ బ్రదర్స్‌గా సహాయ్ సోదరులు

పశ్చిమబెంగాల్ డీజీపీగా వివేక్ సహాయ్(1988 బ్యాచ్) నియామకం పోలీసు శాఖ చరిత్రలో ఒక రికార్డు సృష్టించింది. బీహార్‌లోని ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ముళ్లు ఐపీఎస్‌లు అవడమే కాక, రెండు రాష్ట్రాలకు వేర్వేరుగా డీజీపీలుగా నియమితులయ్యారు. వివేక్ సహాయ్ సోదరుడు వికాస్ సహాయ్(1989 బ్యాచ్) గత ఏడాది కాలంగా గుజరాత్ డీజీపీగా పనిచేస్తున్నారు. వీరి మరో సోదరుడు విక్రమ్ సహాయ్ కూడా 1992 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన ఢిల్లీ ఐటీ విభాగంలో పనిచేస్తున్నారు.

ప్రత్యర్థులపై ప్రైవేటు నిఘా

- ఎన్నికల వేళ డిటెక్టివ్ ఏజెన్సీలకు పెరిగిన డిమాండ్
- ప్రత్యర్థుల ఎత్తులు తెలుసుకునేందుకు కాంట్రాక్టులు
- టికెట్ దక్కని నేతలు, అనుచరుల కదలికలపైనా నిఘా



న్యూఢిల్లీ, మార్చి 19: ఎన్నికల యుద్ధంలో గెలిచేందుకు అభ్యర్థులు తమ శక్తియుక్తులన్నీ ప్రదర్శిస్తారు. 'జో జీతా వోహీ సికందర్' అన్నట్టుగా గెలవడానికి ఎలాంటి ఎత్తులైనా వేస్తారు. ఇలా ప్రత్యర్థులు వేసే ఎత్తులను గుర్తించి ఎదుర్కోవడం ప్రతి అభ్యర్థికీ సవాల్ లాంటిది. అందుకే, ఈ బాధ్యతలను ఇప్పుడు పలువురు అభ్యర్థులు ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీలకు అప్పగిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల కదలికలపై ఒక కన్నేసి ఉంచే బాధ్యతను ఈ సంస్థలకు ఇస్తున్నారు. తద్వారా ప్రత్యర్థి బలాలు, బలహీనతలు, రహస్యాలు, ఎన్నికల క్షేత్రంలో అవలంబించబోతున్న ప్రణాళికలు అన్నీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఎన్నికల వేళ ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీలకు డిమాండ్ పెరిగింది.

ప్రత్యర్థుల డబ్బు, మద్యంపై నిఘా

ఎన్నికలకు కొన్ని నెలల ముందుగానే తమకు కొందరు అభ్యర్థులు పని అప్పగించారని ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీలు చెప్తున్నాయి. ప్రత్యర్థుల క్రిమినల్ రికార్డులు, అవినీతి ఆరోపణలు వంటివి తెలుసుకుంటున్నారట. ఇందుకు గానూ ప్రైవేటు ఏజెన్సీలు ఆర్టీఐని ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకున్నాయట. ఎన్నికల్లో కీలకంగా మారిన డబ్బు, మద్యం పంపకం వ్యవహారాన్ని గుర్తించే బాధ్యతను కూడా కొందరు అభ్యర్థులు ప్రైవేటు నిఘా సంస్థలకు అప్పగిస్తున్నారు. ప్రధానంగా డబ్బు, మద్యాన్ని ఎక్కడ దాచారో గుర్తించే పనికి పురమాయిస్తున్నారని ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న సిటీ ఇంటెలిజెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాజీవ్ కుమార్ చెప్తున్నారు.

సొంత నేతలపైనా కన్ను

ఎన్నికల్లో పోటీ చేసే ప్రత్యర్థులే కాదు సొంత పార్టీలో టికెట్ ఆశించి భంగపడిన వారు, అనుమానం ఉన్న అనుచరులపై కూడా కొందరు అభ్యర్థులు నిఘా పెడుతున్నారట. వీరు తమ సమాచారాన్ని ప్రత్యర్థులకు అందిస్తూ వారి చేతుల్లో అస్త్రాలుగా మారుతున్నారా అనేది తెలుసుకునేందుకు వీరి కదలికలపై దృష్టి సారించేలా ప్రైవేటు డిటెక్టివ్‌లకు పని అప్పగిస్తున్నారట. అభ్యర్థులే కాకుండా పార్టీలు కూడా కొన్ని డిటెక్టివ్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ముఖ్యంగా అభ్యర్థుల బ్యాగ్రౌండ్ వెరిఫికేషన్, నియోజకవర్గాల్లో వారికి వాస్తవంగా ఉన్న బలాలను గుర్తించి నివేదిక ఇచ్చే బాధ్యతను పార్టీలు అప్పగిస్తున్నాయని స్లీత్స్ ఇండియా అనే డిటెక్టివ్ ఏజెన్సీ ఎండీ నమన్ జైన్ తెలిపారు.

కేంద్ర మంత్రి పశుపతి పరాస్ రాజీనామా

బీజేపీ అన్యాయం చేసిందంటూ ఆరోపణ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర మంత్రి వర్గం నుంచి పశుపతి పరాస్ వైదొలిగారు. బీహార్‌లో లోక్‌సభ ఎన్నికల్లో మిత్రపక్షాలతో సీట్ల పంపకాల ఒప్పందం నుంచి రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీని తప్పించి బీజేపీ అన్యాయం చేసిందని ఆరోపిస్తూ మంగళవారం రాజీనామా చేశారు. సీట్ల పంపకాల్లో భాగంగా చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీకి బీజేపీ ఐదు సీట్లు ఇచ్చిన మరుసటి రోజే పరాస్ రాజీనామా ప్రకటించారు. ఎన్‌డీఏకు తాను నిజాయితీ, విధేయతతో పనిచేశానని, అయితే తనకు అన్యాయం జరిగిందని పరాస్ వాపోయారు. ఎన్డీయే నుంచి వైదొలగిన పరాస్.. విపక్ష ఆర్జేడీ కూటమిలో చేరి హాజీపూర్ నుంచి చిరాగ్‌పై పోటీ చేయనున్నట్టు సమాచారం.

బీజేపీలోకి శిబు సోరేన్ పెద్ద కోడలు సీతా సోరేన్

ఎన్నికల ముంగిట జేఎంఎంకు షాక్

రాంచీ, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల వేళ జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)కు ఊహించని షాక్ తగిలింది. జేఎంఎం అధినేత శిబు సోరేన్ పెద్ద కోడలు, మాజీ సీఎం హేమంత్ సోరేన్ వదిన సీతా సోరేన్ బీజేపీలో చేరారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇంచార్జ్ లక్ష్మీకాంత్ బాజ్‌పాయ్ సమక్షంలో మంగళవారం ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు. దీనికంటే కొన్ని గంటల ముందు ఆమె జేఎంఎం పార్టీకి రాజీనామా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన భర్త దుర్గా సోరేన్ కన్నుమూశాక.. పార్టీ నుంచి తన కుటుంబానికి మద్దతు కరువైందని ఆరోపించారు. మూడోసారి ఎమ్మెల్యేగా ఉన్న సీతా సోరేన్.. శాసనసభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు.

జర్నలిస్టులకూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

అత్యవసర సేవల వారికీ అవకాశం: ఈసీ

న్యూఢిల్లీ, మార్చి 19: పోలింగ్ రోజు ఎన్నికల వార్తలను కవర్ చేసే జర్నలిస్టులతో పాటు అత్యవసర సేవల్లో ఉన్న వారందరూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. మెట్రోలు, రైల్వే తదితర విభాగాల్లో పోలింగ్ రోజు సేవలందించే వారంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఈసీ తెలిపింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఓటరుగా నమోదు చేసుకున్న పార్లమెంటరీ నియోజకవర్గంలోని సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి ఫారం 12డీని తీసుకోవాలని ఈసీ సూచించింది. లేదంటే ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ నుంచి కూడా ఈ ఫారంను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

71 వేల మంది డిపాజిట్ గల్లంతు

- తొలి లోక్‌సభ నుంచి ఏటేటా పెరుగుతున్న సంఖ్య
- 2019లో అత్యధికంగా డిపాజిట్ కోల్పోయిన బీఎస్పీ

న్యూఢిల్లీ, మార్చి 19: ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి సెక్యూరిటీ డిపాజిట్ కట్టాల్సిందే. అయితే ఇప్పటి వరకు ఎంతమంది అభ్యర్థులు తమ డిపాజిట్ కోల్పోయారో తెలుసా? ఎన్నికల సంఘం వద్ద ఉన్న డాటా ప్రకారం.. 1951 నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా సుమారు 71 వేల మంది లోక్‌సభకు పోటీ చేసిన అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కోల్పోయారు. ఇప్పటి వరకు మొత్తం 91,160 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, 71,246 మంది (78 శాతం) ధరావతు గల్లంతైంది. గెలిచిన అభ్యర్థిలో ఆరో వంతు ఓట్లు పడితేనే ఓడిన అభ్యర్థికి కట్టిన డిపాజిట్ వాపస్ ఇస్తారు. ఆరో వంతు ఓట్లు పడకపోతే సొమ్ము పోయినట్టే లెక్క. ఆ సొమ్మును ట్రెజరీకి జమ చేస్తారు. 2019 ఎన్నికల్లో 86 శాతం మంది అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారు. తొలి లోక్‌సభ (1951-52)లో 1,874 మంది బరిలో నిలవగా 745 మంది(40 శాతం)కి డిపాజిట్ దక్కలేదు. ప్రతి సారి డిపాజిట్ దక్కని వారి సంఖ్య పెరుగుతూ పోతున్నది.

సెక్యూరిటీ డిపాజిట్ ఇలా..

	1951లో	ప్రస్తుతం
ఎస్సీ, ఎస్టీలు	రూ.250	రూ.12,500
జనరల్	రూ.500	రూ.50,000

అజిత్ పవార్‌కే గడియారం గుర్తు

సుప్రీంకోర్టు తీర్పు

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) చీలిక వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎన్సీపీ గుర్తు అయిన గడియారాన్ని అజిత్ పవార్ వర్గం వాడుకునేందుకు అనుమతించింది. అయితే గడియారం గుర్తు అంశం కోర్టు పరిధిలో ఉందని, దీని వినియోగం తుది తీర్పుకు లోబడి ఉంటుందని అన్ని పత్రికల్లో హిందీ, ఇంగ్లిష్, మరాఠి భాషల్లో పబ్లిక్ నోటీసులు ఇవ్వాల్సిందిగా కోర్టు ఆదేశించింది. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో శరద్‌పవార్ ఫొటో వాడుకోవద్దని అజిత్ పవార్ వర్గానికి స్పష్టంచేసింది. మరోవైపు శరద్ పవార్ వర్గం.. 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ - శరద్‌చంద్ర పవార్' పేరును వాడుకునేందుకు అనుమతించింది. వీరికి 'బాకా ఊదుతున్న మనిషి' గుర్తును కేటాయించాలని ఎన్నికల కమిషన్‌కు కోర్టు సూచించింది.

హిట్లర్‌ను అరెస్టు చేసిన కెనడీ!

మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో సంచలనం

న్యూఢిల్లీ, మార్చి 19: మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 2008 లో ఓ వార్త సంచలనం సృష్టించింది. అడాల్ఫ్ హిట్లర్‌ను జాన్ ఎఫ్ కెనడీ అరెస్టు చేశారన్నదని ఆ వార్త సారాంశం. కానీ, నాడు అరెస్టయింది జర్మనీ నియంత హిట్లర్ కాదు. ఆయనను అరెస్టు చేసింది అమెరికా మాజీ అధ్యక్షుడు కెనడీ కాదు. ఇంతకీ అప్పుడు ఏం జరిగిందంటే.. మేఘాలయ అసెంబ్లీకి ఎన్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అడాల్ఫ్ లు హిట్లర్ మారక్‌ను ఎన్నికల ప్రచార సమయంలో ఎస్పీ జాన్ ఎఫ్ కెనడీ అరెస్టు చేశారు. అప్పట్లో పలు పత్రికలు ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఆ తర్వాత ఆ ఎన్నికల్లో హిట్లర్ గెలుపొందారు. ఆ ఉదంతాన్ని ఈసీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

22తో ముగియనున్న హెచ్-1బీ రిజిస్ట్రేషన్ల గడువు

వాషింగ్టన్: భారతీయులు సహా ఎంతోమంది వృత్తి నిపుణులు ఆశగా ఎదురుచూసే అమెరికా హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 22తో ముగియనుంది. విదేశీ నిపుణులను నియమించుకునేందుకు అమెరికా కంపెనీలకు అనుమతించే ఈ వీసాకు విపరీతమైన పోటీ ఉంటుంది. అమెరికాలోని టెక్ కంపెనీలు ఎక్కువగా ఇండియా, చైనా వంటి దేశాలకు చెందిన వృత్తి నిపుణులపై ఆధారపడి ప్రతి సంవత్సరం వేలాదిమందిని నియమించుకుంటాయి. 2025 సంవత్సరానికి గాను హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్ గడువు మార్చి 22తో ముగుస్తుందని యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ తెలిపింది. ఫాం ఐ-129 (వలసేతర వర్కర్ వీసా పిటిషన్), ఫాం ఐ-907 (ప్రీమియం ప్రాసెసింగ్ సేవ కోసం)ను ఆన్‌లైన్‌లో ఉంచామని తెలిపింది.

ఈడీ సమన్లపై హైకోర్టుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మార్చి 19: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ తనకు జారీ చేసిన సమన్లను సవాల్ చేస్తూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరుగనున్నది. ఈ కేసులో కేజ్రీవాల్‌కు 8సార్లు సమన్లు అందాయి. అయినా కేజ్రీవాల్ విచారణకు హాజరు కాలేదు. దీంతో ఈడీ కోర్టుకు వెళ్లింది. తప్పనిసరి పరిస్థితిలో కోర్టుకు హాజరైన కేజ్రీవాల్‌కు న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

మహువాపై సీబీఐ దర్యాప్తు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగడానికి ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రాపై యాంటీ కరప్షన్ అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ మంగళవారం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఆరు నెలల్లోగా నివేదిక సమర్పించాలని స్పష్టంచేసింది. ఈ కేసు కారణంగా మహువా లోక్‌సభ సభ్యత్వం రద్దయిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరోవైపు, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లోని క్రిష్ణానగర్ స్థానం నుంచి ఆమె మళ్లీ బరిలోకి దిగుతున్నారు.

'క్రెడిట్' బద్ధలైతే.. ఇక అంతే!

- ఇబ్బడిముబ్బడిగా బ్యాంకుల క్రెడిట్ కార్డులు జారీ
- ద్రవ్య వినిమయం, వడ్డీ కోసం రూల్స్ సరళతరం
- పదేండ్లలోనే ఐదు రెట్లు పెరిగిన కార్డుల జారీ
- చెల్లింపుల్లో జాప్యం చేస్తున్న లక్షలాది మంది
- రూ. నాలుగు వేల కోట్లకు చేరుకున్న డిఫాల్ట్స్
- భారం పడుతుందోనన్న భయంలో డిపాజిటర్లు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): 'సార్, మీకు క్రెడిట్ కార్డు ఆఫర్ ఉంది? ఎలాంటి ఛార్జీలు లేవు', 'మేడమ్.. కార్డు తీసుకొంటే ఎన్నో ఆఫర్లు ఉన్నాయ్'.. పొద్దున లేచింది మొదలు.. రాత్రిపడుకొనే వరకూ ఇలాంటివి రోజుకు కనీసం రెండు మూడు ఫోన్ కాల్స్ రావడం నేటిరోజుల్లో సర్వసాధారణంగా మారింది. పదేండ్ల కిందట క్రెడిట్ కార్డు కావాలంటే బ్యాంకులు పెట్టే సవాలక్ష నిబంధనలను సంతృప్తిపర్చాల్సిందే. అయితే, ద్రవ్య వినిమయం, ఎక్కువ వడ్డీ వస్తుందన్న కారణంతో క్రెడిట్ కార్డ్స్ జారీకి అనుసరించాల్సిన రూల్స్‌ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ప్రస్తుతం సరళతరం చేశాయి. అసలు కస్టమర్ డబ్బును తిరిగి చెల్లిస్తాడో లేదో అనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఇబ్బడిముబ్బడిగా క్రెడిట్ కార్డులను జారీ చేస్తున్నారు. దీంతో క్రెడిట్ కార్డుదారుల డిఫాల్ట్స్ (90 రోజులైనా తిరిగి రుణాలను చెల్లించనివారు) కేసులు అంతకంతకూ పెరుగుతున్నట్టు ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో సంక్షోభానికి దారితీయొచ్చని హెచ్చరిస్తున్నారు. క్రెడిట్ డిఫాల్ట్స్ పెరుగుతుండటంతో తమ డబ్బును కూడా బ్యాంకులు తిరిగి చెల్లిస్తాయో లేదోనన్న ఆందోళనతో డిపాజిటర్లు ఉన్నారు.

క్రెడిట్ డిఫాల్ట్స్ ఇలా..

2014 నుంచి 2024 మధ్యలో పెరిగిన క్రెడిట్ కార్డుల జారీ- 5 రెట్లు

2021-22లో క్రెడిట్ కార్డ్స్ డిఫాల్ట్స్ విలువ-	2022-23లో క్రెడిట్ కార్డ్స్ డిఫాల్ట్స్ విలువ-	ఏడాది వ్యవధిలో పెరిగిన డిఫాల్ట్స్ మొత్తం
3,122 కోట్లు	4,072 కోట్లు	950 కోట్లు

గడిచిన మూడు నెలల్లో క్రెడిట్ కార్డుల ద్వారా వినియోగదారులు వెచ్చించిన మొత్తం — రూ. 5 లక్షల కోట్లు (జీడీపీలో 2 శాతం)



సీఏఏపై స్టేకు సుప్రీం నిరాకరణ

పిటిషన్లపై 3 వారాల్లో స్పందన తెలియజేయాలని కేంద్రానికి ఆదేశం

వచ్చే నెల 9కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 19: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సీఏఏను సవా ల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మూడు వారాల్లోగా స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది. అంతకుముందు పిటిషన్లపై సమాధానం ఇచ్చేందుకు నాలుగు వారాల సమయం ఇవ్వాలని కేంద్రం తరపు న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టును కోరారు. కా గా, సీఏఏ చట్టంతో ఏ వ్యక్తి పౌరసత్వాన్ని తొలగించబోమని మెహతా ఈ సందర్భంగా కోర్టుకు తెలిపారు. సీఏఏ-2019 రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తీర్పునిచ్చే వరకు చట్టంలోని నిబంధనల అమలుపై స్టే విధించాలని కోరుతూ తాజాగా కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. 2019లో పార్లమెంట్ ఆమోదించిన పౌరసత్వ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నాలుగేండ్ల తర్వాత అమలు చేస్తూ లోక్‌సభ ఎన్నికల వేళ ఇటీవల నిబంధనలను నోటిపై చేసిన విషయం తెలిసిందే.

యునిలీవర్‌లో 7,500 ఉద్యోగాల కోత

లండన్, మార్చి 19: బ్రిటన్‌కు చెందిన మల్టీనేషనల్ కంపెనీ 'యునిలీవర్' భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించనున్నది. కంపెనీ ఆధ్వర్యంలోని 'బెన్ అండ్ జెర్రీ' ఐస్ క్రీమ్ సంస్థను మూసేస్తున్నామని, ఇందులో 7,500 ఉద్యోగాల తొలగిస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. బ్రిటన్‌లో సబ్బులు, వ్యాసలీన్, టూత్‌పేస్టులు.. అనేక రకాల వినియోగ వస్తువుల్ని ఉత్పత్తి చేస్తున్న 'యునిలీవర్' కంపెనీలో దాదాపు 1,28,000 ఉద్యోగులు ఉన్నారు. 2022 ప్రారంభంలోనూ ఈ కంపెనీ 1,500మందిని తొలగించింది.

నో రోడ్.. నో ఓట్

ఎన్నికల్ని బహిష్కరిస్తూ అమేథిలోని గ్రామస్థులు నిరసన

లక్నో, మార్చి 19: దేశంలో వీవీఐపీ నియోజకవర్గంగా గుర్తింపు పొందిన యూపీలోని అమేథిలో రోడ్లు సరిగా లేక వివిధ గ్రామాల ప్రజలు అవస్థ పడుతున్నారు. గౌరీగంజ్ తహశీల్ పరిధిలోని కుగ్రామం 'సర్మెనీ' ప్రజలు గ్రామం బయట 'నో రోడ్.. నో ఓట్' అంటూ బ్యానర్లు కట్టారు. లోక్‌సభ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. గ్రామాన్ని సమీప ప్రాంతాలకు కలుపుతూ 7 చిన్న రోడ్లు ఉన్నాయని, అవన్నీ అధ్వానస్థితిలో ఉన్నాయని గ్రామస్థుడు ఓం ప్రకాశ్ ఓజా చెప్పారు. తాగునీరు, మురుగునీటి పారుదల.. వంటి వసతులు లేవు. రోడ్డు సమస్య పరిష్కారం అయ్యే వరకు ఎన్నికల్ని బహిష్కరిస్తాం' అంటూ ఓజా చెప్పారు.

ఎన్డీఏలోకి రాజ్‌ఠాక్రే?

ఉద్ధవ్‌కు చెక్‌పెట్టేందుకు బీజేపీ పావులు

ఛత్రపతి శంభాజీనగర్, మార్చి 19: మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్న బీజేపీ సరికొత్త వ్యూహాలు రచిస్తున్నది. మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్)ను ఎన్డీఏలో చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నది. ఇందులో భాగంగా ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ ఠాక్రేతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చర్చలు జరిపారు. గత ఎన్నికల్లో బీజేపీ - శివసేన కలిసి పోటీ చేసి మహారాష్ట్రలోని 48 లోక్‌సభ సీట్లకు 41 స్థానాలు గెలుచుకున్నాయి. అయితే, ఈసారి బీజేపీకి కాంగ్రెస్, శివసేన(యూబీటీ), ఎన్సీపీ(శరద్‌చంద్ర పవార్) పార్టీల కూటమి గట్టి పోటీ ఇస్తున్నది. ముఖ్యంగా శివసేన రెండుగా చీలినప్పటికీ ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన(యూబీటీ) మరాఠాల్లో బలమైన రాజకీయ శక్తిగా కొనసాగుతున్నది.

పూలు తెంపే రోబో

వారాంతపు సెలవులు తీసుకోదు. మూడు షిఫ్టుల్లో పని చేస్తుంది. యజమాని అప్పగించిన పనిని పూర్తి చేసి శభాష్ అనిపించుకుంటుంది ఈ రోబో. నెదర్‌ల్యాండ్స్‌లోని ఓ తులిప్ పూల తోటలో ఒక వ్యక్తి పూలు తెంపేందుకు అధునాతన రోబోను వినియోగిస్తున్నాడు. ఈ రోబోకు తన మాజీ ఉద్యోగి పేరైన థియో అని పెట్టాడు.

రాజ్యసభ ఎంపీగా సంజయ్‌సింగ్ ప్రమాణం

న్యూఢిల్లీ, మార్చి 19: ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్ రెండోసారి రాజ్యసభ సభ్యునిగా మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఆయనతో ప్రమాణం చేయించారు. తీహార్ జైలులో ఉన్న సంజయ్ సింగ్‌ను స్థానిక కోర్టు ఆదేశాల మేరకు భద్రతా ఏర్పాట్ల మధ్య తీసుకొచ్చారు. ప్రమాణ స్వీకారం అనంతరం తిరిగి జైలుకు తీసుకెళ్లాలని సంబంధిత జైలు సూపరింటెండెంట్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో సంజయ్ సింగ్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

వాతావరణ మార్పులపై 'రెడ్ అలర్ట్'

- 2023లో అత్యధిక వేడి
- ఈ ఏడాది ఇంకా ఎక్కువే!
- డబ్ల్యూఎంవో వార్షిక నివేదిక

జెనీవా, మార్చి 19: వాతావరణ మార్పులపై ప్రపంచానికి ఐక్యరాజ్యసమితి అనుబంధ ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. చరిత్రలో ఎన్నడూ లేనంత వేడి 2023 సంవత్సరంలో రికార్డైందని, 2024లో ఇంతకంటే ఎక్కువ వేడి ఉండే అవకాశం ఉందని పేర్కొన్నది. గతంలో ఎప్పుడూ లేనంత ఉష్ణోగ్రత జనవరిలో నమోదైందని తెలిపింది. 'స్టేట్ ఆఫ్ ది గ్లోబల్ క్లైమెట్' పేరుతో ఈ సంస్థ మంగళవారం వార్షిక నివేదికను విడుదల చేసింది. గత ఏడాది రికార్డు స్థాయిలో గ్రీన్‌హౌస్ వాయువులు, భూమి, నీటి ఉష్ణోగ్రతలు పెరిగాయని, మంచుపర్వతాలు, సముద్రపు మంచు గరిష్ఠ స్థాయిలో కరిగిపోయిందని ఈ నివేదిక పేర్కొన్నది. భూతాపం పెరుగుదల పారిశ్రామీకరణకు ముందు కంటే 1.5 డిగ్రీలకు మించకుండా కట్టడి చేయాలని చేసుకున్న పారిస్ ఒప్పంద లక్ష్యం ప్రమాదంలో ఉందని తెలిపింది. 2023 నుంచి 2024 మధ్య 12 నెలల కాలంలో భూతాపం పెరుగుదల సగటున 1.56 డిగ్రీలుగా నమోదైనట్టు పేర్కొన్నది. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ మాట్లాడుతూ... భూగ్రహం ప్రమాదపుటంచున ఉన్నదని ఈ నివేదిక చెప్తున్నదని పేర్కొన్నారు.

**ప